## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-12-99, కాపవరం,

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు గీతాజయంతి. కృష్ణాష్టమి, శ్రీరామనవమి, రమణ జయంతి ఇలా అవతారపురుషుల, మహాత్ముల యొక్క పుట్టినరోజులు చేస్తాము. ప్రపంచంలో పుస్తకానికి పుట్టినరోజు జరిగేది భగవద్గీతకే. అది గీత యొక్క గొప్పతనం. మనకు అనేక గ్రంధాలు అక్కర లేదు. ఒక్క భగవద్గీత చాలు. గీతను జాగ్రత్తగా చదివి, అర్ధంచేసుకొని మనం ఎంతవరకు ఆచరించగలమో అంతవరకు ఆచరిస్తే ఆచరించిన విషయాలు మనకు అనుభవంలోనికి వస్తాయి. అనుభవంలోనికి వచ్చినప్పుడు మన హృదయంలో ఉన్న వస్తువే మనకు తెలియబడుతుంది. ఆ వస్తువుకు పుట్టుకలేదు, చావు లేదు, ఆ వస్తువులో దుఃఖంలేదు. ఆ వస్తువును ఎలా పొందాలో గీతలో రకరకాలుగా, ఎలా చెపితే మన మెదడుకు పడుతుందో అలాగ భగవంతుడు చెప్పాడు. ఏదైనా చెప్పటానికైనా, వినటానికైనా అధికారం ఉండాలి. పూర్వజన్మలో ఎంతో కొంత నిష్కామకర్మ చేసి ఉంటే, పుణ్యకర్మ చేస్తే వినటానికి, చెప్పటానికి అధికారం కలుగుతుంది. అధికారం లేనప్పుడు ఒక వేళ విన్నా అది మెదడుకు పట్టదు. భగవంతుడు చెప్పిన మాటలు శ్రద్ధగా వింటే ఇంటికి వెళ్ళి మననం చేసుకోవచ్చును. ఆ మాటలను స్మరించుకోవటం వలన మీరు బాగుపడతారు. మీకు ఎంత దుఃఖం ఉన్నా ఆ దుఃఖం అంతా కరిగిపోతుంది.

మనకు చాలా అవతారములు ఉన్నాయి. అత్యంత ముఖ్యమైన అవతారం కృష్ణావతారం. కృష్ణుడు చెప్పినట్లు చేయండి, ఆయన చేసినట్లు చేయవద్దు. నాలుగువేదాల సారం భగవద్గీత. గీత పేరు స్మరించినప్పటికి మన హృదయం విశాలం అవుతుంది, నిర్మలం అవుతుంది, పరిశుద్ధమవుతుంది. నందుని పుత్రుడు, గోకుల విహారి అని అంటే అది కృష్ణుడి దేహానికి వర్తిస్తుంది. కాని నిజమైన కృష్ణుడు మన హృదయంలో ఉన్నాడు. కృష్ణుడు అప్పుడు ఉన్నాడు. ఇప్పుడు లేడు అనుకోవటానికి కారణం మన దేహబుద్ధి. మన దేహబుద్ధి కారణంగానే మన హృదయంలో ఉన్న అందాలు మనకు అందటంలేదు. మన హృదయంలో ఉన్న చైతన్యమే టీచర్‌గా పనిచేయటానికి వచ్చింది. కృష్ణుడు అప్పుడూ ఉన్నాడు, ఇప్పుడూ ఉన్నాడు, మన హృదయంలో ఉన్నాడు, మన కంట్రోలర్‌గా ఉన్నాడు, పిలిస్తే పలుకుతాడు, సత్వగుణం ఉన్నవారికి వ్యక్తమవుతాడు. కృష్ణుడి పట్ల సజీవమైన విశ్వాసం ఉంటే, అర్జునుడికి కృష్ణుడిపట్ల ఎంత భక్తి ఉందో మనకు కూడా అంతభక్తి ఉంటే కృష్ణుడు ఒక్క అర్జునుడికే కాదు మనకు కూడా సారధ్యం వహిస్తాడు.

వస్తువు నీ హృదయంలో ఉంది. ఆ వస్తువు గురించి హృదయంలో వెతకటం మానివేసి పుస్తకాలు చదవటమే పనిగా పెట్టుకొంటే బ్రహ్మం తెలియదు, భ్రమ మిగులుతుంది. ఈ వాక్యము విని మనం ఎంజాయ్ చేయలేకపోతున్నాము అనుకోండి. మనకు అధికారం లేదు అని అర్థం. మనందరము ఏదో పని చేస్తున్నాము. కోరికతో పని చేస్తున్నాము. ఈ పని చేయకపోతే ప్రమాదం వస్తుంది అని భయపడి చేస్తున్నాము. అంతేగాని పని ఇష్టంగా చేయటంలేదు, ప్రేమగా చేయటంలేదు. భగవంతుని యందు ప్రేమతో పనిచేయటంలేదు, కర్మఫలం మీద ప్రేమకొలది పని చేస్తున్నాము. కర్మఫలం పట్ల ఆసక్తి లేకుండా పని చెయ్యి, కర్మఫలం వస్తే రానియ్యి కాని దానియందు ఆసక్తి లేకుండా పని చెయ్యి. రాత్రి మనకు సరిగా నిద్ర పట్టకపోవటానికి కారణం మనకు ఏదో విషయం మీద ఆసక్తి ఉంటుంది. అది మీ మానసిక ఆరోగ్యాన్ని, శారీరక ఆరోగ్యాన్ని చెడగొడుతుంది. మీకు ఏ విషయం పట్ల ఆసక్తి లేకపోతే వెంటనే నిద్రపడుతుంది. ఆసక్తి ఉండటం వలన మీ మనస్సు కలుషితం అవుతుంది. పని చేసేటప్పుడు భగవంతుని స్మరించుకొంటూ హృదయపూర్వకంగా చెయ్యి. నీకు భగవంతుని పట్ల ఎంత ప్రేమ ఉందో పనిమీద కూడా అంత ప్రేమ ఉండాలి. పని చేసేటప్పుడు, మాట్లాడేటప్పుడు గర్వం రాకుండా చూసుకోండి. మాటలో, పనిలో గర్వం ఉంటుంది. మాకు ఉన్న ఈ అలవాట్లు ఎలాగపోతాయి అని అడిగితే ఆ గర్వం తీసివేయమని నన్ను ప్రార్థించండి నేను తీసేస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. ఆసక్తి లేకుండా, గర్వం లేకుండా పనిచేస్తే ప్రేమతో పని చేస్తే ఈ లోకంలో నీ పని పూర్తి అవుతుంది. మరణానంతర జీవితం బాగుంటుంది. మరణానంతరం నీవు ఒక్కడివే ప్రయాణం చేయనక్కరలేదు నీకు జతగా నేను వస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు.

పని చేసి మర్చిపోండి. దాని ఫలం కోసం ఎదురు చూడకండి. ఫలాన్ని ఎప్పుడు ఇవ్వాలో టైముచూసి భగవంతుడు మీకు ఇస్తాడు. కర్మఫలం ఆశించకపోతే రాదేమో అని అనుకొంటారు. ఈశ్వరుడు సర్వసాక్షి. పని చేసేటప్పుడు మీరు ఫలాన్ని ఆశిస్తున్నారో ఆశించటంలేదో చూస్తాడు. ఆశిస్తే మీరు ఆశించినది రావచ్చు. ఆశించకపోతే మీరు అనుకున్నదానికంటే ఎక్కువ రావచ్చును. లేనిపోని గొడవలు ఊహించుకోవద్దు. కర్మఫలాన్ని ఆశించటం వలన మరణానంతరం చీకటిలోకాలకు వెళతావు. పని చేసేటప్పుడు మినహాయింపులు ఉండకూడదు. మీ మనస్సులో దోషం లేకుండా హృదయపూర్వకంగా చేయాలి. పూర్ణజ్ఞానం, పూర్ణభక్తి ఉన్నవాడికి, పరమపవిత్రుడికి శరీరం ఉంటే ఏల, పోతే ఏల. ఇవి కాలక్షేపం కోసం చెప్పకొనే మాటలు కాదు. పూర్ణజ్ఞానం కలిగినప్పుడు అది నీకు అనుభవైకవేద్యం అవుతుంది. నీ హృదయంలో ఏది ఉందో నా

హృదయంలోనూ అదే ఉంది. కొంత అభ్యాసం చేస్తే నా హృదయంలో ఉన్నది నాకు ఎలా తెలిసిందో అలాగే నీ హృదయంలో ఉన్నది నీకు కూడా తెలుస్తుంది అన్నారు భగవాన్.

కామక్రోదములనుండి విడుదల పొందాలి. మిగతా చెడ్డగుణాలు ఎన్ని ఉన్నా ఈ రెండింటిలోనుండి వస్తున్నాయి. అందుచేత ముందు కామక్రోధములనుండి విడుదల పొందు. ఎవడు ఏ వృత్తిలో ఉన్నప్పటికి కామక్రోధముల నుండి ఎవడైతే విడుదలపొందాడో వాడుమాత్రమే ముక్తుడు. నీ పూర్వజన్మ సంస్కారమును బట్టి నీకు ఏ మార్గం ఇష్టమైతే ఆ మార్గంలో సాధన చెయ్యి. ఏ మార్గంలో సాధన చేస్తున్నావు అనేది ముఖ్యంకాదు, కామ క్రోధముల నుండి విడుదల పొందాలి అది ముఖ్యం. నేను రాత్రి ఒంటిగంట వరకు చదివాను అంటే మార్కులు వేయరు. నీవు పేపరులో వ్రాసిన దానిని బట్టి మార్కులు వేస్తారు. అలాగే నేను గుడులు చుట్టూ తిరిగాను, నదులలో మునిగాను, యజ్ఞాలు, యాగాలు చేసాను అంటే కుదరదు. నాకు ఈ గొడవలు ఏమీ అక్కరలేదు, నీవు కామక్రోధములనుండి బయటకు వచ్చావా, లేదా అది కావాలి. ఒకవేళ వాటిలోనుండి నీవు బయటకు రాలేకపోతే నీవు ముక్తుడవు కాలేవు అంటున్నాడు కృష్ణుడు. చెట్టు మొదలు నరికివేస్తే ఆకులు, కొమ్మలు వాటి అంతట అవేపోతాయి. అలాగే కామక్రోదములు పోతే మిగతా చెడ్డగుణాలు పోతాయి. ఈ రెండే నీ చేత పాపం, దోషం చేయిస్తాయి. ఆర్థికంగా కాని, ఆధ్యాత్మికంగా కాని అభివృద్ధిలోనికి రాకుండా ఈ రెండే నిన్ను పాడుచేస్తున్నాయి. కొంత మంది నెలకు లక్ష రూపాయలు సంపాదిస్తారు భోగాలకు లక్షాపదివేలు ఖర్చుపెడతారు. కొంతమందికి ఎన్ని సంపదలు ఉన్నావారికి భోగాలు అక్కరలేదు, సౌఖ్యాలు అక్కరలేదు వారు మహాత్ములు. వారికి ఎంత ధనం ఉన్నా యోగులతో సమానము, వారు పూర్వజన్మలో ఎంతో సాధనచేసి యోగులు అయి, ఎక్కడో వారి యోగం భంగం అయ్యి పతనమైన వారు అయి ఉండవచ్చు.

నీ మనస్సు ఎప్పుడూ ఆత్మజ్ఞానంలో నిలకడగా ఉండాలి. రేడియోలో ఏ స్టేషన్ కావాలంటే ఆ స్టేషన్‌కి ట్యూన్ పెట్టుకొంటాము. అలాగే నీ మనస్సును ఆత్మజ్ఞానంతో కనెక్టు చేయాలి. అప్పడు నీ మాట పవిత్రం, నీ చూపు పవిత్రం, నీలోనుండి శాంతి తరంగాలు, కాంతి తరంగాలు, శక్తి తరంగాలు వచ్చి లోకం అంతా తడుపుతాయి. మనకు ఇప్పడు అహంకారముతో, అజ్ఞానంతో కనక్షన్ ఉంది. దానిని కట్‌చేసి జ్ఞానంతోటి, చైతన్యంతోటి అనుబంధం పెట్టుకోవాలి. నీవు పనిచేసేటప్పడు అది ఎందుకు చేస్తున్నావో ఇతరులకు తెలియకపోయినా నీకు తెలుస్తూ ఉంటుంది కదా. నీవు చేసేపని యోగివి అయ్యి చెయ్యి అప్పడు అది యజ్ఞం అవుతుంది. మనం స్వార్థం లేకుండా, కీర్తిని

ఆశించకుండా ప్రేమగా పనిచేస్తే అది యజ్ఞం. యజ్ఞం ఎందుకు అంటే నీవు పవిత్రుడవు అవ్వటంకోసం. సన్యాసం అంటే అది ఒక మానసికస్థితి. రాగద్వేషములు లేకుండా ఉండటమే సన్యాసం. నీవు తెల్లబట్టలు కట్టుకొన్నా, ఎర్రబట్టలు కట్టుకొన్నా నీలోపల రాగద్వేషములు ఉంటే నీవు సన్యాసివి ఎలా అవుతావు. నీలోపల రాగద్వేషములు లేనప్పుడు, మనస్సు సమానంగా ఉన్నప్పుడు నీవు ఏరంగు బట్టలు కట్టుకొన్నా నీవు సన్యాసివే. సన్యాసం అనేది నీ బట్టలను బట్టి ఆధారపడిలేదు. అది ఆంతరంగిక స్థితి. అది నీ మనస్సులోపల ఉన్న వైభవం అంతే గాని నీ శరీరానికి కప్పకొన్న బట్టలను బట్టికాదు.

నీవు చేసేపని ప్రేమతో చెయ్యి. స్వార్ధంలేకుండా చెయ్యి. అలా చేస్తే నీకు ఫలితం వచ్చింది అనుకో అది నిన్ను బంధించదు. అడిగితే భగవంతుడు ఇస్తాడు. అడగకపోతే ఇవ్వడు అని మనకు అనుమానం అది జీవలక్షణం. అడుగకిచ్చెడు నీదు అకళంకమగు కీర్తి హాని చేయక బ్రోవుము అరుణాచలా అన్నారు భగవాన్. పనిలో ప్రేమ, ఆప్యాయత ఉండాలి. స్వార్ధం లేకుండా చెయ్యాలి. స్వార్ధం లేకుండా చేస్తున్నాము కదా అని తింగరగా చేయకూడదు, పనిలో ఓర్పు, నేర్పు ఉండాలి. ఇవి అన్నీ అర్ధం చేసుకొని నీవు పని చేయటం నేర్చుకొంటే పూర్వజన్మలో దోషాలు, ఈ జన్మలో దోషాలు పోతాయి. రాబోయే జన్మకు కారణాలు ఏమైనా ఉన్నా అవి అన్నీ కాలిబూడిద అవుతాయి. విత్తనం కాలిపోతే భూమిలో పాతినా మొక్కరాదు. అదే విధంగా రాబోయే జన్మకు ఉన్న కారణములు ఇప్పడే కాలిపోతే నీకు పునర్జన్మ రాదు అంటే నీకు మోక్షం వస్తుంది అని చెప్పకుండా చెప్పటం. నీవు ఏదోరకంగా హృదయంలో ప్రవేశించాలి. ఎందుచేతనంటే బ్రహ్మం అక్కడ ఉంది, చావులేనిస్థితి అక్కడే ఉంది. అనుమానం ఉన్నవారికి జ్ఞానమార్గం మంచిది. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం ఉన్నవారికి శరణాగతి మార్గం మంచిది. పరిపూర్ణమైన శరణాగతి పొందినవాడిని వాడి తలంపులు ఏమీ బాధపెట్టవు. భగవంతుని సంకల్పం ఎలా అంటే అలా జరుగుతుంది అనుకొంటాడు వాడు ఏమీ ఊహించుకోడు, లేనిపోని భయాలు పెట్టుకోడు. వారు నన్ను సరిగా చూస్తారా లేదా అని ఇలా వెర్రిగా ఊహించుకోడు. ఒక్కోసారి ఎవరైతే మనలను చూస్తారు అనుకొంటామో వారు చూడరు. ఎవరైతే చూడరు అనుకొంటామో వారు మనలను చూస్తారు ఈశ్వరుని విలాసం ఎలా ఉంటుందో చెప్పలేము. ఈగోడ అవతల ఏముందో మనకు తెలియదు. ఈశ్వరుడు సర్వసాక్షి, సర్వ వ్యాపి ఆయనకు తెలియని విషయం అంటూ ఈ సృష్టిలో ఏమీ ఉండదు. పూర్ణశరణాగతిలో ఏది వచ్చినా అది ఈశ్వరప్రసాదమే అనుకొంటాడు. వాడికి తలంపులు ఉండవు. ఇంక వాడికి ఘర్షణ ఉండదు. ఘర్షణ లేకపోతే ఇంకవాడికి

దుఃఖం ఉండదు. పూర్ణశరణాగతిలో ఉన్నవాడు భగవంతుడు ఏది అనుగ్రహిస్తే దానితో సంతృప్తి పడతాడు. మనం అనుకొన్నది రాదు, ఆయన అనుగ్రహించినది వస్తుంది. ఆయన అనుగ్రహించినది రాకుండా ఎవరైనా ఆపుచేద్దామన్నా అది ఆగదు. భగవంతునికి ఎవడు శరణాగతి పొందుతాడు అంటే భగంతుని శక్తి మీద నమ్మకం ఉన్నవాడు మాత్రమే ఆయనకు శరణాగతి పొందుతాడు. అందరూ శరణాగతి పొందలేరు. గంగానదిలో స్నానం చేసినా, ఆ నీరు త్రాగినా మనం పవిత్రులమవుతాము అని అందరూ అనుకొంటారు. కాని ఎవడైతే ఈశ్వరుడి కోసం తపనపడి ఆయన కోసం రెండు కన్నీటి బొట్లు రాల్చాడో ఆ కన్నీటి బొట్లు గంగానది నీరు కంటే పవిత్రమైనవి అని తుకారామ్ చెప్పాడు.

మనం అజ్ఞానంలో ఉండి జ్ఞానంలో ఉన్నాము అనుకొంటున్నాము. ఇంకమనం ఏమి ప్రయత్నం చేస్తాము. అజ్ఞానంలో ఉన్నామని అనుకొంటే అందులోనుండి విడుదల చేయమని భగవంతుని ప్రార్థిస్తాము. వాస్తవపరిస్తితిని మనం అర్థంచేసుకోవాలి. చూడటం వేరు, పరిశీలించటం వేరు. నిన్ను నీవు బాగా పరిశీలించుకొంటే నీలోని బలహీనతలు తెలుస్తాయి. అప్పడు ఆబలహీనతలనుండి బయటపడటానికి ప్రయత్నం చెయ్యి. కొంతమందికి అహంభావన ఉంటుంది. సమాజానికి వారి అహంభావన తెలియకుండా ముస్తాబు చేస్తారు. అది మరీ ప్రమాదం. వాడి అహంభావన సమాజానికి కనబడకపోయినా కంట్రోలర్ చూస్తున్నాడనే ఎరుక వాడికి లేదు. సమాజానికి కనబడకుండా ముస్తాబు చేసినా సర్వసాక్షికి తెలియకుండా ఎలా ఉంటుంది. సముద్రం అనంతంగా ఉంటుంది. పైన కెరటాలు ఉంటాయి. ఆ కెరటాలు మనకు గొప్పగా ఉంటాయి సముద్రానికి అవి ఏమీ గొప్పకాదు. కెరటాలు ఉన్నా పట్టించుకోదు, కెరటాలు ఆగిపోయినా పట్టించుకోదు. చూసే వారు కెరటాలగురించి పట్టించుకొంటారు. కాని సముద్రం పట్టించుకోదు. అలాగే మహాజ్ఞాని కూడా తన మనస్సును పట్టించుకోడు.

నీ అహంభావన ఎందుకు పనికి రానిది అని ముందు నిర్ణయించుకో. అహంభావన ఎందుకు పనికిరాదు అని నీకు అర్థమయితే నీకు అర్థమయిన అర్థమే నిన్ను గమ్యానికి చేరుస్తుంది. విష్ణు సహస్రనామాలు అంటే దేవుని గుణాలు. దానిని పారాయణ చేయటం వలన మనం పవిత్రులవుతాము. పవిత్రుడికే వినటానికైనా, స్మరించటానికైనా అధికారం ఉంటుంది. మనకు తగిన పవిత్రత, యోగ్యత ఉన్నప్పడు గైడెన్స్ లోపల నుండి వస్తుంది. జరిగిపోయిన గొడవలు మర్చిపోతే మీరు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తారు. జరిగిపోయిన గొడవలు మర్చిపోకుండా మీరు ఎంత సాధన చేసినా జరిగిపోయిన గొడవలు స్మరిస్తూ ఉంటే అవి మీ సాధనను తినేస్తాయి. మీ సాధన చిల్లు బిందిలో నీరు

పోసినట్లుగా అవుతుంది. పురోగతి ఉండదు. మీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణం చేయండి. లాంఛనంగా చేయవద్దు, యాంత్రికంగా చేయవద్దు. పరిపూర్ణమైన భక్తితో అందులో లీనమై పనిచేయండి. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని పనిచెయ్యండి. అలా పనిచేస్తే ఎప్పుడూ నీ కూడా నేను ఉంటాను అని భగవంతుడు చెపుతున్నాడు. మీ ఇంటిలో ఎవరైనా ముసలివారు ఉన్నారు అనుకోండి. వారికి ప్రేమగా సేవచేస్తే మీరు పూజలు చేయనక్కరలేదు. పూజవలన ఎంత ఫలితం వస్తుందో అంతకంటే ఎక్కువ ఫలితం పరమేశ్వరుడు ఇస్తాడు. ఎందుచేతనంటే ఫలితం ఇచ్చేవాడు పరమేశ్వరుడు. ఎవడి హృదయంలో భగవంతుడు ప్రవేశించాడో వాడి అభివృద్ధిని ఎవరూ ఆపుచేయలేరు. ఏశక్తి ఆపుచేయలేదు. ఈశ్వరుడు హృదయంలో ప్రవేశించటానికే ఈ సత్సంగాలు, ఈ ప్రవచనాలు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-12-99, కేశవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భగవద్గీతను మనం చదవటం, ఇతరులచేత చదివించటం, దానిని ప్రచారం చేయటం ఇవి అన్నీ పుణ్యప్రధములు. ఇది అంతా జ్ఞానయజ్ఞం లోనికి వస్తుంది. గీతయొక్క వైభవం తెలిస్తే గీతను చదువుతారు, దానిని అర్థం చేసుకొని ఆచరించటానికి ప్రయత్నం చేస్తారు, మోక్షాన్ని పొందుతారు. మనకాలం అంతా తిండి, నిద్రతోనే సరిపోతోంది. ఈ రెండూ తగ్గించుకోవాలి. తగుమాత్రంగా తినాలి, తగుమాత్రంగా నిద్రపోవాలి. తిండి విషయంలో, నిద్ర విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనం ఒక మాట మాట్లాడితే అది ఇతరులకు చల్లదనం కలుగజేయాలి, శాంతి కలుగజేయాలి, దాని వలన వారి చైతన్యస్థాయి పెరగాలి. ముందు ఆలోచించి తరువాత మాట్లాడాలి. నీవు జ్ఞానివి అయినప్పటికి శవం భూమి మీద తిరుగుతున్నంత కాలం యజ్ఞ, దాన, తపస్సులను విడిచి పెట్టకు అని కృష్ణుడు చెప్పాడు. నిరంతరము ఈశ్వరుని యందు మనస్సు నిలబెట్టేవాడు భక్తుడు. ఏ విధమైన వికారములు లేనివాడు యోగి, అహంకారము లేనివాడు జ్ఞాని.

శ్రీకృష్ణుని సాక్షాత్కారం పొందాలని ఉంది నన్ను ఏమి చేయమంటారు అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నాడు. కృష్ణుడు అంటే ఏమిటి? సాక్షాత్కారం అంటే ఏమిటి? అని భగవాన్ తిరిగి ప్రశ్నిస్తున్నారు. బృందావనంలో గోపికలు శ్రీ కృష్ణుని ఎలా దర్శించారో అలాగ దర్శించాలని ఉంది అని చెపుతున్నాడు. కృష్ణుడు అంటే వసుదేవుని

కుమారుడని, ఆయన ధరించిన దేహమే కృష్ణుడని నీవు అనుకుంటున్నావు. కాని అది వాస్తవం కాదు. నీవు అనుకొనేది నిజం కాదు. జీవకోటి అందరి హృదయాలలో చైతన్యంగా ఉన్నాను అని కృష్ణుడు చెపుతున్నాడు. కాని మనం ఏమనుకొంటున్నాము అంటే కృష్ణుడు అప్పుడు ఉన్నాడు, ఇప్పుడు లేడు అనుకొంటున్నాము. ఒక కాలంలో ఉండి, ఒక కాలంలో లేకపోతే వాడు దేవుడు ఎలా అవుతాడు. అందరి హృదయాలలో చైతన్యముగా ఉన్నవాడిని నేనే, అన్ని జీవులకు ఆది నేనే, అంతం నేనే, వారిని సృష్టించే వాడిని, పోషించే వాడిని, లయం చేసే వాడిని నేనే. జీవుడికి, సృష్టికి, పంచభూతాలకు అధారంగా ఉన్నది నేనే అని భగవంతుడు చెపుతున్నాడు. నీ శరీరం మరణించిన మరణంలేని వస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే నిజమైన సాక్షాత్కారం. కృష్ణుడిని చూడాలంటున్నావు సాక్షాత్కారం అంటే బొమ్మలను చూడటం కాదు. నీ శరీరం చనిపోతుంది. కాని మరణంలేని వస్తువు నీ హృదయంలో ఉంది. దానికి నీ శరీరానికి నీ మనస్సుకు ఇసుమంతయు సంబంధం లేదు. కాని అది నీలోపల ఉంది. దానికి మరణం లేదు. దాని స్వరూపమే శాంతి, దాని స్వరూపమే ఆనందం. ఆ వస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవటమే సాక్షాత్కారం. రాముడు, కృష్ణుడు సాక్షాత్కరిస్తే నీవు ఎంత సేపు చూస్తావు, ఆయన ఎంతసేపు ఉంటాడు. ఆయన వరాలు ఇస్తాడు వాటిని అనుభవిస్తే పోతాయి. అది జ్ఞానమా? అది సాక్షాత్కారమా? సర్వకాల సర్వావస్థలలో ఉండే వస్తువు నీకు కావాలా లేక ఈ వేళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే విషయాలు నీకు కావాలా? భగవంతుడు అంతటా ఉన్నాడు నీ హృదయంలోనూ ఉన్నాడు. నీ లోపల ఉన్న చైతన్యం గురించి నీకు తెలిస్తే కృష్ణుడు అంటే ఎవడో నీకు తెలుస్తాడు కాని లేకపోతే నీవు ఎంత ప్రయత్నం చేసినా కృష్ణుడు అంటే ఏమిటో నీకు తెలియదు. నీ హృదయంలో ఉన్న ఆనందం, శాంతి నీకు అందినప్పుడు నిజమైన కృష్ణుడు నీకు తెలుస్తాడు. ఈ బొమ్మలను, శవాలను, నీడలను చూస్తావా? కర్మానుభవాన్నిబట్టి ఈ శవాలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి, నేను బృందావనంలో ఉన్నాను, ద్వారకలో ఉన్నాను అని గీతలో భగవంతుడు చెప్పలేదు. నీ హృదయంలో ఉన్నాను అని చెప్పాడు అది చూడు అప్పుడూ కృష్ణ సాక్షాత్కారం ఏమిటో తెలుస్తుంది. నీవు ఎవడో నీకు తెలిస్తే కృష్ణుడు ఎవడో నీకు తెలుస్తుంది. నీవు హృదయంలోనికి వెళ్ళలేవు అనుకో భగవంతునికి పూర్తిగా శరణాగతి చెందు. శరణాగతి మార్గం కూడా నిన్ను ఒడ్డుకు తీసుకొని పోతుంది. ఎవరినైతే నీవు పొందాలి అనుకొంటున్నావో వారి అనుగ్రహం లేకుండా వారిని పొందలేవు. ఈ పూజలకు, జపాలకు మోసపోయేటంత అమాయకుడు కాదు దేవుడు. పూజ చేయి, జపం చేయి మంచిదే

అవి నీ మనోనిగ్రహానికి, ఇంద్రియనిగ్రహానికి సహకరిస్తాయి. అంత మాత్రం చేతనే నీకు సాక్షాత్కారం కలుగదు. ఏ వస్తువునయితే పొందాలి అనుకొంటున్నావో ఆ వస్తువు తాలూకు అనుగ్రహం లేకుండా ఆ వస్తువును నీవు పొందలేవు. ఆ వస్తువును పొందాలి అని నీవు ఎలా అనుకొంటున్నావో అలాగ నీకు తెలియబడాలి అని ఆ వస్తువు అనుకొంటే నీకు దర్శనం సాధ్యం లేకపోతే నీ పని సున్న. నీ హృదయంలో ఉన్న వస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవటానికి నీ లోపం లేకుండా కృషి చెయ్యి. నీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా, ప్రేమగా చెయ్యి. ఫలితం కోసం ఎదురు చూడకు. ఎప్పుడు, ఎక్కడ నీకు ఎలా దర్శనం ఇవ్వాలో ఆయనే ఇస్తాడు. నీ చేతిలో ఉన్న పనిని నీవు చేయి, ఆయన చేతిలో ఉన్న పనిని ఆయన చేస్తాడు. నీవు కృషి చేస్తూ ఉంటే నీ కృషే కృపగా మారుతుంది.

నీ మనస్సును నాయందు నిలబెట్టు అని భగవంతుడు చెపుతున్నాడు. నీవు మనస్సుతో ఏ విషయాలను చింతిస్తున్నావో అదే అవుతావు. అందువలన సత్పురుషుల సహవాసం అవసరం నీ మనస్సును విషయాల మీద పెడుతున్నావు. నీకు విషయానందం కావాలి గాని ఆత్మానందం అక్కరలేదు. ప్రతీ విషయానందం కూడా పరిణామంలో వడ్డీతో సహా దుఃఖం గా మారిపోతుంది. నీ మనస్సును, బుద్దిని నాకు అర్పించి నన్ను స్మరిస్తూ, నన్ను ధ్యానం చేస్తూ, నా మాటను గౌరవించి దాని ప్రకారం జీవించగలిగితే నా స్వరూపాన్ని నీకు ఇస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. కృష్ణుడికి రోజూ పూజ చేస్తాము అని చెపుతూ ఆయన చెప్పిన మాట ఒక్కటి కూడా వినకపోతే అది భక్తి ఎలా అవుతుంది? నీ మనస్సును, బుద్ధిని నాకు అర్పించి నన్నే మార్గంగా , నన్నే గమ్యంగా పెట్టుకొని జీవిస్తూ ఉంటే ఈ లోకంలోనే కాదు నీ శరీరం మరణించిన తరువాత నీవు ఏ లోకంలో ఉన్నా కూడా నీవు నాయందే నివశిస్తావు అని భగవంతుడు చెపుతున్నాడు. ఎవరి మీద నీకు ద్వేషం వద్దు. ఎవరినీ ద్వేషించవద్దు అని ఎందుకు చెపుతున్నాడు అంటే నీవు ఎవరినైతే ద్వేషిస్తున్నావో వాడి హృదయంలో కూడా భగవంతుడు ఉన్నాడు. అందుచేత వాడిని ద్వేషిస్తే భగవంతుడిని అవమానించినట్లు అవుతుంది. ఎవడైతే నిరంతరము ఏనిమిషానికి ఆ నిమిషం తన బ్రెయిన్‌ను బేలెన్స్ చేసుకొంటూ మాట్లాడుతున్నాడో, జీవిస్తున్నాడో వాడు దేవుడు లేడు అనుకొన్నా వాడిని జ్ఞానం వరిస్తుంది. ఎర్రబట్టలు కట్టుకొన్నవారు అంటే నాకు ఇష్టం, తెల్లబట్టలు కట్టుకొన్నవారు అంటే నాకు ఇష్టం, నిలువు బొట్లు పెట్టుకొన్నవారు అంటే నాకు ఇష్టం, అడ్డ బొట్లు పెట్టుకొన్నవారు అంటే నాకు ఇష్టం అని ఇలా భగవంతుడు చెప్పలేదు. అహంకారము లేని వారు, మమకారం లేనివారు అంటే నాకు ఇష్టం, వారికి నా స్వరూపాన్ని ఇస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు.

20-01-2000

జీవితంలో ప్రతీ సంఘటన తలంపే. పుట్టుక ఒక తలంపు, మరణం ఒక తలంపు, దుఃఖం ఒక తలంపు, సుఖం ఒకతలంపు అన్నీ తలంపులే. జాగ్రదవస్థలో మనకు తలంపులు వస్తాయి, మనం రకరకాలుగా ఉంటాము. మనకు కోపం వస్తూ ఉంటుంది, చిరాకు వస్తూఉంటుంది. అనేక వికారములు వస్తూఉంటాయి. వికారాలు లేనప్పుడు నీవు ఉన్నావు. ఈ వికారములకు ఆధారంగా వికారములు లేని వస్తువు ఒకటి ఉంది దానిని పట్టుకో. నీవు చావులేని స్థితిని పొందుతావు.

మనకు సహనం తక్కువ. మనం ఒక చేతితో సహనం, ఒక చేతితో శ్రద్ద పట్టుకోవాలి. అలా పట్టుకొంటే మీశ్రద్ధే, మీ సహనమే మిమ్మల్ని గమ్యానికి చేరుస్తుంది. మమకారం వలన మనం దోషాలు, పాపాలు చేస్తాము మన ఇంట్లో పిల్లలు కోట్ల రూపాయలు పాడు చేసినా మనకు ఇష్టమే కాని ఎదుటి వారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వాలని ఉండదు అది మమకారం అంటే. మీకు ఏ కారణం వలన దుఃఖం వచ్చినా మమకారం వలన వస్తోంది. మమకారం లేకపోతే మీకు దుఃఖం లేదు. దేహమే ఆత్మ, దేహం చనిపోయిన తరువాత ఇంకేమీ లేదు అనుకొనేవాడికి నా స్వరూపాన్ని ఇవ్వను. చైతన్యం ఒకటి ఉంది. దానికి ఈ శరీరానికి ఇసుమంతయు కూడా సంబంధం లేదు అని ఎవడైతే గుర్తించాడో వాడికి నా స్వరూపాన్ని ఇస్తాను అంటున్నాడు భగవంతుడు. తల్లి కడుపులోనుండి బయటకు వచ్చినది మొదలు చివరి శ్వాస వరకు ప్రతి సంఘటన ఈశ్వర సంకల్పం ప్రకారం జరుగుతుంది. పెళ్ళి, మరణం వంటి సంఘటనలే కాదు ప్రతీ చిన్న సంఘటన కూడా నిర్ణయం ప్రకారం జరుగుతుంది. తల్లి కడుపులో ఉండగానే నీ సినిమా తీసేస్తారు. అప్పుడు నిన్ను భూమిమీదకు పంపుతారు. ఆ సినిమా ప్రకారం నడుచుకొంటావు. కాని నీవు ఏమనుకొంటావు అంటే నా తెలివితేటల వలన ఇలా నడుచుకొంటున్నాను అనుకొంటావు ఏదో రోజు ఈ దేహం చనిపోతుంది. దేహప్రారబ్ధంలో నీకు సుఖం రావలసి ఉంటే సుఖం, దుఃఖం రావలసి ఉంటే దుఃఖం వస్తూ ఉంటాయి. నీవు ఆ ప్రవాహంలో కొట్టుకొని పోవద్దు. నీ మనస్సును సమానంగా ఉంచుకో.

ఇంద్రియాలకు సంబంధించిన విషయములలో దేనిపట్ల నీకు ఆపేక్ష పనికిరాదు. ఆపేక్ష లేకపోతే నీకు అంతర్‌దృష్టి కలుగుతుంది. నీకు ఇంద్రియ విషయముల పట్ల ఆపేక్ష లేకపోతే నీరు పల్లానికి ప్రవహించినట్లు నీ మనస్సు హృదయాభి ముఖంగా ప్రయాణంచేసి హృదయాకారం చెందుతుంది. లోపల, బయటకూడా శుచిగా ఉండమని భగవంతుడు చెపుతున్నాడు. రజోగుణం ఉన్నవాడు బయట బాగా శుచిగా ఉండాలనుకొంటాడు, లోపల గొడవ వాడికి అక్కరలేదు. సత్వగుణం ఉన్నవాడు లోపల శుచిగా ఉండాలి బయట

సామాన్యంగా ఉన్నాచాలు అనుకొంటాడు. శుచిగా ఉండటం వలన మానసిక ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం బాగుంటుంది. ఆరోగ్యముగా ఉన్న శరీరము, ఆరోగ్యముగా ఉన్న మనస్సు బ్రహ్మమును తెలుసుకోవటానికి సహకరిస్తాయి. స్వప్నంలో అనేక మందితో మాట్లాడతారు, అనేక మంది కనిపిస్తారు. జాగ్రదవస్థలోనికి వచ్చిన తరువాత వారి గురించి ఆలోచించరు ఎందుచేతనంటే అది నిజం కాదు అని నీకు తెలుస్తుంది. ఈ జీవితాలు, ఈ చావు పుట్టుకలు కూడా అంతే, ఇప్పుడు దేనిగురించి అయినా బాధ వస్తోంది అనుకోండి, దుఃఖం వస్తోంది అనుకోండి, సడన్‌గా మీకు జ్ఞానం కలిగితే నేను ఎంత వెర్రివాడను, నాకు తెలియక కంగారుపడి ఎంత బాధపడ్డాను, ఇందులో ఏమీలేదు అని మీకు అనిపిస్తుంది. మిమ్మల్ని చూసి మీరే నవ్వుకుంటారు. అందువలన ఏ విషయానికి బాధపడకండి, మిమ్మల్ని మీరు హింసించుకోవద్దు, మీకు జ్ఞానం కలిగినప్పుడు ఎంత దుఃఖం ఉన్నా అది అంతా ఆనందంగా మారిపోతుంది. అది జ్ఞానం యొక్క వైభవం. మీరు వాడుకొనే వస్తువులను కూడా మీరు నిర్లక్ష్యం చేయవద్దు. జాగ్రత్తగా చూసుకోండి వాటిని నిర్లక్ష్యం చేస్తే మీకు మరల ఆ వస్తువులు లేకుండా చేస్తాడు.

పని శ్రద్ధగా చేయటమే కాదు ఎలా పనిచేస్తే కర్మఫలం నిన్ను చుట్టుకోదో తెలుసుకొని అలా పనిచేయాలి. మీరు చేస్తున్న పని పునర్జన్మకు హేతువు కాకూడదు. కొంతమంది ఎప్పుడూ ఏదో వ్యాకులత పెట్టుకొంటారు. ఒక సమస్య తరువాత ఇంకో సమస్యను తెచ్చుకొంటారు. పెద్దకారణం ఏమీ ఉండదు. ఎప్పడూ దుఃఖ పడుతూ ఉంటారు. అది మంచిది కాదు. మిమ్మల్ని ఎవరైనా విమర్శించినా మీరు భయపడకండి, వారికంటే మీరే పరిశుద్ధమైన హృదయం కలవారు.

వ్యాకులత పడటానికి కారణం ఉన్నప్పటికి నీవు వ్యాకులత పడకుండా ఉండటమే గొప్ప విషయం. వ్యాకులత పడటానికి కారణం ఉన్నప్పటికి నీవు వ్యాకులత పడకుండా ఉంటే భగవదనుగ్రహానికి పాత్రుడవుతావు. భగవంతుడు తన యొక్క జ్ఞానముతో నిన్ను అలంకరిస్తాడు. కొంత మందికి ఎంతసేపు వారి పొట్ట, బట్ట తప్పించి ఇతరుల గురించి ఆలోచన ఏమీ ఉండదు. ప్రతీ విషయానికి నాకు ఏమి కలసి వస్తుంది అని అనుకొంటే నీకు స్వార్థం పెరిగిపోతుంది. స్వార్థం పెరిగిపోతే పరమార్థానికి దూరం అవుతావు. కేవలం స్వార్థం కోసం నీవు చేసే పనులు విడిచిపెట్టు. మాకు అశాంతిగా ఉందని చాలామంది అంటూ ఉంటారు. మీకు చేతనయిన చిన్న చిన్నమంచి పనులు చేయండి, మీకు అశాంతి తగ్గిపోతుంది.

20-01-2000